




వెన్నుపోటుపై పిడికిలి

వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కదంతొక్కారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించింది. సూపర్‌సిక్స్ పేరుతో డబ్బాకొట్టిన నాయకులు అమలుకు కుంటిసాకులు చెబుతున్నారు. అభివృద్ధి పేరుతో పథకాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. హామీలపై 'వెన్నుపోటు దినం' నిర్వహించాలని వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు సూపర్‌సిక్స్‌పై ప్లకార్డులతో నిరసన తెలిపారు. –సాక్షిఫొటోగ్రాఫర్, గుంటూరు











క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీలక్ష్మీ సుదర్శన హోమం



నగరంపాలెం: స్థానిక కొత్తపేట(పశువుల ఆస్పత్రి ఎదురు)లోని జగన్నాథస్వామి దేవస్థానంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రెండో రోజు కొనసాగాయి. వేణుగోపాలస్వామికి గంధంతో అలంకారం, శ్రీలక్ష్మీ సుదర్శన హోమం, మూల మంత్ర హోమం గ్రామ బలి హరణ నిర్వహించారు. దేవస్థానం ఈఓ టి.సుభద్ర పర్యవేక్షించారు.

కొనసాగిన శ్రీమద్భవద్గీత ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై బుధవారం శ్రీమద్భగవద్గీత 15వ అధ్యాయం పురుషోత్తమప్రాప్తియోగం ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయామిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రవచనాన్ని ప్రారంభిస్తూ వాయువు వాసనలను ఒకచోటి నుంచి వేరొక చోటికి తీసుకెళ్లినట్లు దేహాదులకు జీవాత్మ ఒక శరీరాన్ని, మనస్సు ఇంద్రియాలను గ్రహించారని అన్నారు. కార్యక్రమంలో బండ్లమూడి విజయలక్ష్మి పాల్గన్నారు.

అన్ని వర్గాలను మోసగించిన మోదీ

సీపీఐ నాయకుడు అజయ్ కుమార్

లక్ష్మీపురం: నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత పేదలు నానా అవస్థలు పడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వంద రోజుల్లో ధరలు తగ్గిస్తానని ధరలు విపరీతంగా పెంచారని ఆరోపించారు. వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి రైతులు పూర్తిగా నష్టపోయే విధంగా చట్టాలు తీసుకొచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న అనేక హక్కుల్ని కాల రాస్తున్నారని మండిపడ్డారు. 44 లేబర్ చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల ఉసురుపోసుకున్నారని అన్నారు.

దళం.. దండుకుంటోంది..!

- కాసుల కురిపిస్తున్న కమిషనర్ పర్యటనలు
- రోడ్ల ఆక్రమణలపై ఆగ్రహం
- కొద్ది రోజుల తరువాత డబ్బులిస్తే మళ్లీ అవకాశం
- వీధి వ్యాపారులు.. దళానికి వరం



అమరావతి రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తున్న అక్రమ ఆక్రమణ నిర్మూలన దళం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కమిషనర్ నగర పర్యటనలు సిబ్బందికి కాసులు కురిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆక్రమణల నిర్మూలన దళం సభ్యుల చేతివాటం పెరిగిపోయింది. రోడ్ల వెంట వ్యాపారం చేసుకునే వారిని తొలగించాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేస్తే వారికి పండుగ అని చెప్పాల్సిందే.. కమిషనర్ చెప్పినట్లుగా కొద్దిరోజుల పాటు బండ్లు తొలగించడం ఆ తరువాత తిరిగి ఏర్పాటు చేసుకొండని వారే మౌఖికంగా ఉచిత సలహాలు ఇచ్చి ప్రతి నెల వారి వద్ద నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారు.

ప్రైమ్ ఏరియాల్లో భారీగా వసూలు..

నగరపాలక సంస్థ పరిధిలో నగరపాలక సంస్థ మెయిన్ గేటు ముందు, నాజ్‌సెంటర్, రైల్వే స్టేషన్, గుజ్జనగుండ్ల, అమరావతి రోడ్డు, తదితర ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకునే వారిని తొలగించే విధంగా కమిషనర్ శ్రీనివాసులు చర్యలు తీసుకున్నారు. అయితే సదరు ప్రాంతాల్లో తిరిగి కొద్ది రోజుల తరువాత వ్యాపారాలు మొదలు పెడుతున్నారు. ఈ విధంగా వ్యాపారం చేసుకునే వారిని బెదిరించి.. ఇక్కడ బండి ఎందుకు పెట్టావు అని వారిని భయాందోళనకు గురి చేసి వారి వద్ద నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారని పలువురు వీధి వ్యాపారులే చెబుతున్నారు.

ఫ్లెక్సీ ఫ్రేమ్‌లు, కాటాలు అమ్ముకుంటూ..

ఆక్రమణల నిర్మూలన దళం బృందం రోడ్డు వెంట వివిధ కార్యక్రమాల కోసం ఏర్పాటు చేసుకునే ఫ్లెక్సీలను, ఫ్లెక్సీ ఫ్రేమ్‌లను తొలగించి వాటిని ఒక ప్రాంతంలో భద్రపరచాల్సి ఉంటుంది. కానీ వీటితో పాటు వీధి వ్యాపారుల వద్ద నుంచి సేకరించే కాటాలను కూడా సేకరించి వాటిని కూడా తక్కువ రేటుకు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏదైన వ్యాపారానికి సంబంధించిన చిన్న చిన్న లాలీ పాప్స్, హోర్డింగ్స్ తొలగిస్తే వాటిని తిరిగి వారికే ఎంత కొంత డబ్బులు తీసుకుని ఇచ్చేస్తుంటారని సమాచారం.

విధులు ఎలా అంటే..

గతంలో ఈ అక్రమ ఆక్రమణ దళం సభ్యులు టౌన్ ప్లానింగ్ విభాగంలో చైన్‌మెన్‌లుగా పనిచేసేవారు. నగరంలో ఎక్కడ అనధికార కట్టడాలు జరిగిన అక్కడ వాలిపోయి భవన నిర్మాణదారులను భయపెట్టి వారి నుంచి ముడుపులు తీసుకుని టౌన్ ప్లానింగ్ అధికారులకు కొంత ఇచ్చి వీరు కొంత తీసుకునే వారు. వీరు చేస్తున్న ఆగడాలు పెచ్చు మిరిపోవడంతో గతంలో మేయర్‌గా పనిచేసిన కావటి మనోహర్‌నాయుడు వీరిని చైన్‌మెన్‌లుగా తొలగించి అక్రమ ఆక్రమణ దళానికి వినియోగించుకోవాలని ఆదేశించడంతో అప్పటి నుంచి వీరంతా దళంలో పనిచేస్తున్నారు. అయితే వీరి ఆదాయానికి గండి పడటంతో రోడ్ల వెంట వ్యాపారాలు చేసుకునే వారి నుంచి మామూళ్లు వసూలు చేసుకుంటు తమ జేబులు నింపుకుంటున్నారని సమాచారం. ఒక వేళ వారు ముడుపులు ఇవ్వకుంటే వారి వద్ద ఉండే కూరగాయాలు, ఆకుకూరలు, పండ్లు, టిఫిన్‌లు ఇలా వారు ఏ వ్యాపారం చేస్తే వారి నుంచి ఉచితంగా వాటిని తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

అక్రమ ఆక్రమణ నిర్మూలన దళం రోడ్లపై వ్యాపారం చేసుకునే వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

– రాంబాబు, సిటీ ప్లానర్

క్లీన్ అండ్ గ్రీన్ గుంటూరు సాధనే ధ్యేయం

మేయర్ రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, పక్కన కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే నసీర్

నెహ్రూనగర్: క్లీన్ అండ్ గ్రీన్ గుంటూరు సాధనే ధ్యేయంగా నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల భాగస్వామ్యంతో కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. బుధవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చేపట్టనున్న కార్యక్రమాలపై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు నసీర్ అహ్మద్, కార్పొరేటర్లు, నోడల్ అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా గుంటూరు నగరంలో వార్డుల వారీగా కార్పొరేటర్లకు మొక్కలు, గుడ్డ సంచులను నగరపాలక సంస్థ నుంచి అందిస్తున్నామని చెప్పారు. ఆయా వార్డులలో కార్పొరేటర్ల ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు, విద్యార్థులను భాగస్వాములను చేసుకుంటూ మొక్కలు నాటటం, గుడ్డ సంచులు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కార్పొరేటర్ల భాగస్వామ్యం పెరగాలన్నారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఈ సీజన్‌కి ఐదు లక్షల మొక్కలు నాటేలా వార్డు సచివాలయాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని తెలిపారు. అదే విధంగా ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా తక్కువ ధరకు గుడ్డ సంచులను అందించేలా గాంధీ పార్కు, ఎన్టీఆర్ స్టేడియం దగ్గర వెండింగ్ మెషిన్లను అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. కేజీ ప్లాస్టిక్ వ్యర్థాలు ఇస్తే గాంధీ పార్కు ఎంట్రీ టికెట్ అందిస్తామని చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా గురువారం స్థానిక కన్యక పరమేశ్వరి అమ్మవారి గుడి దగ్గర నుంచ హిమని సెంటర్ వరకు మాస్ క్లీనింగ్ చేస్తూ, పర్యావరణ పరిరక్షణపై అవగాహనా ర్యాలీ జరుగుతుందన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, ఎస్ఈ నాగామల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డెప్యూటీ కమిషనర్లు డి. శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్ శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



పిల్లలకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ రాజకుమారి

గుంటూరు మెడికల్: ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని అహల్య ట్రస్టు డైరెక్టర్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని మాతృ శ్రీ పిల్లల ఆశ్రమంలో చిన్నారులకు మామిడి పండ్లు అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలన్నారు. అందులో భాగంగా తమ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సులు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా వైద్యులంతా సేవాభావం కలిగి ఉండి పేదలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. పలువురు పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. వారికి ఆరోగ్యం బాగుండేందుకు వ్యాయామం, యోగ, ఆహార నియమాలు పాటించాలని సూచించారు. మంచి ఆరోగ్యం కోసం సెల్ ఫోన్‌కు, శీతలపానీయాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయుడు



బాలు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్

నగరంపాలెం: స్థానిక నాజ్ కూడలిలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు కళాదర్బార్– ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), కళా దర్బార్ అధ్యక్షుడు పాతూరి రంగారావు, గాయని, గాయకులు ఆయన కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాదర్బార్ సభ్యులు భానుప్రకాష్, పగడాల వేణుగోపాల రావు, సిరిపురపు శ్రీధర్, సత్తార్, గాయని, గాయకులు మిరియాల ప్రసాదరావు, కంబాల బాబురావు, సుధీర్, అబ్దుల్ ఖాదర్ ఇస్మాయిల్, రాధానాయుడు, సేవాసదన్ అధ్యక్షులు మిరియాల గోపి, జమదగ్ని పాల్గొన్నారు.

గాన గాంధర్వుడు ఎస్పీ బాలుకి నివాళి

లక్ష్మీపురం: గాయకులుగా ఎన్నో పాటలకు జీవమూ అందించి నటుడిగా విలక్షణత ప్రదర్శించి, సంగీత దర్శకునిగా అపూర్వమైన ప్రయోగాలు చేసిన ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తెలుగు ప్రజలకు ఆరాధ్యుడని సంగీత విద్వాంసులు గాయకులు వి.ఎస్.ఎన్. మల్లేశ్వరరావు, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఎస్పీ బాలు జయంతి బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఎస్పీ బాలు ఆలపించిన చలన చిత్ర గీతలు పాడిన వారు లేరని ఆయన పాడినన్ని భక్తీ గీతాలు పాడిన వారు లేరని ఈ అరుదైన ఘనతను సాధించిన అరుదైన వ్యక్తిగా కొనియాడారు. సంస్థ సాంస్కృతిక కార్యక్రమాల కోఆర్డినేటర్ బిళ్ల అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎస్పీ బాలు పాటల లాగానే మాటలు కూడా తీయనైనా వేనని చెప్పారు.

కోడిగుడ్డు సత్రం హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలి



హాస్టల్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్

లక్ష్మీపురం: కోడిగుడ్డు సత్రం వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. వసతి గృహాన్ని బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ప్రారంభానికి నోచుకోకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. అయన మాట్లాడుతూ హాస్టల్ నిర్మాణం పూర్తయినప్పటికీ విద్యార్థులకు మాత్రం అందుబాటులోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల పోరాటంతో డిసెంబర్‌లోనే ప్రారంభిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఎస్సీ, బీసీ విద్యార్థులు వందలాదిమంది చదువుకోవాల్సిన హాస్టల్ ఖాళీగా ఉండటం దుర్మార్గమని అన్నారు. పది సంవత్సరాల నుంచి విద్యార్థులు అద్దె భవనాల్లో ఇబ్బందులు పడుతున్న హాస్టల్లో ప్రారంభించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పేద విద్యార్థులకు హాస్టల్‌లో వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఏ యశ్వంత్, ఉపాధ్యక్షులు సుభాని, బి.రాకేష్ సుభాష్ పాల్గొన్నారు.

తొమ్మిదిన జిల్లా స్థాయి చదరంగం పోటీలు



నగరంపాలెం: భవన్స్ అకాడమీ ఆఫ్ కల్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్, ఇంటాక్ గుంటూరు జిల్లా చాప్టర్ సంయుక్తంగా ఈ నెల తొమ్మిదిన 15 ఏళ్ల లోపు బాల, బాలికలకు జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు భారతీయ విద్యా భవన్ గుంటూరు కేంద్ర కార్యదర్శి పి.రామచంద్రరాజు తెలిపారు. కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని భారతీయ విద్యాభవన్లో బుధవారం పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ విద్యా భవన్‌లోని శ్రీబొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో మేధను పెంపొందించేందుకు, మానసిక, వ్యక్తిత్వ వికాసానికి చదరంగం క్రీడ దోహదపడుతుందని అన్నారు. ఇంటాక్ గుంటూరు చాప్టర్ కన్వీనర్ ఎస్.వి.ఎస్.లక్ష్మీనారాయణ, శ్రీ ఆనంద్ చెస్ అకాడమీ నిర్వాహకులు గోపి మాట్లాడారు. మరిన్ని వివరాలకు 9703049378, 9124519444 సంప్రదించాలని కోరారు.

క్రీడా దుస్తులు బహూకరణ



లక్ష్మీపురం: సీఆర్ పార్క్ ఎక్సర్‌సైజ్ వారియర్స్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా క్రీడా దుస్తులను కమిటీ సభ్యులు చందోలు శివ బహూకరించారు. స్థానిక కృష్ణానగర్‌లోని కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు పార్క్‌లో వారియర్స్ కమిటీ ద్వితీయ వార్షికోత్సం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారియర్స్ కమిటీ అధ్యక్షుడు ఆడమ్స్ సుమారు 50 సంవత్సరాలు పై బడిన పురుషులు, మహిళలు అందరూ గత రెండు సంవత్సరాలుగా ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు ఉచితంగా సభ్యులకు ఎక్సర్‌సైజ్‌లు నేర్పించడం జరుగుతుందన్నారు. ఒక కమిటీగా ఏర్పడి పార్కు అభివృద్ధితో పాటుగా సమాజానికి అవసరమైన పరిస్థితులలో తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్ పార్క్ ఎక్సర్‌సైజ్ వారియర్స్ కమిటీ సెక్రెటరీ రామచంద్రుడు, కమిటీ సభ్యులు షేక్.బాబు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, శకుంతల, రమాదేవి, రజిని పాల్గొన్నారు.



బుచ్చయ్యతోట ఆరో వీధికి దగ్గర్లోని రోడ్డుపై కర్ర పుల్లతో..



రాజీవ్‌గాంధీనగర్ ప్రధాన రోడ్డుపై గుంత చుట్టు రక్షణ ఇదేనా..

డేంజర్ గుంతలు

తాగునీటి పైపులైన్ల మరమ్మతుల దృష్ట్యా తవ్విన గుంతలు ప్రమాదభరితంగా మారాయి. నగరంలోని రాజీవ్‌గాంధీనగర్ మూడో వీధి, బుచ్చయ్యతోట ఆరో వీధి సమీపా దారి మధ్యలో ఇటీవల తాగునీటి పైపులైన్ల మరమ్మతుల దృష్ట్యా గుంతలు తవ్వారు. అయితే ఈ రెండు గుంతలు కూడా నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే ఆయా రహదారుల మధ్యలో ఉన్నాయి. రాజీవ్‌గాంధీ నగర్‌లోని గొయ్యి వద్ద పనులు పూర్తికాకపోవడంతో, దాని చుట్టుతా పుల్లలు, విద్యుత్ స్తంభానికి ప్లాస్టిక్ తాడు కట్టేసి వదిలేశారు. ఇక బుచ్చయ్యతోటలో లీకేజీ గుంత వద్ద ఓ కర్ర పుల్లకు పచ్చని గోతాలు చుట్టి వదిలేశారు. కనీసం గుంతలు ఉన్నాయని, జాగ్రత్తగా వెళ్లాలంటూ ప్రమాద హెచ్చరిక సూచించే బోర్డు ఏర్పాటులో నిర్లక్ష్యం ప్రదర్శించారు. రాత్రివేళల్లో గుంతలు కానరావడంలేదని వాహనదారులు వాపోతున్నారు.

– నగరంపాలెం